డబ్బులో రూ 150లు అప్పుడే ఖర్చయిపోయింది. అతను రైలు కింద పడ్డానికి యింక నాలుగు రోజులు దాటదు.

ఇల్లు విడిచిన నాలుగోరోజు పేపర్లో తనకోసం రాఘవేంద్ర రావుగారూ, పరంధామయ్యగారూ ప్రకటన చేశారు.

తన యిష్ట ప్రకారమే అన్నీ జరుగుతాయనీ కాన వెంటనే వచ్చెయ్యమని ప్రకటనలోని హంశం. చచ్చేలోగా రాధని చూడ దల్చుకోని రాజేశ్వర్రావు ఆమె గురించి తన అభిప్రాయం మార్చు కొని రైలెక్కాడు తనూరికి.

❖ ❖ ❖

పరంధామయ్యగారితో పరిష్కారం చేసుకున్న రాఘవేంద్ర రావుగారు మరో నాల్రోజులు ఆ చుట్టుపక్క లున్న బంధువు లందర్నీ చూసి మరీ యిల్లు చేరేరు ఆరోనాటికల్లా.

ఈ సంబంధం యేమౌతుందా అని యెప్పుడూ ఆరాట పళ్ళేదు రాధ. తన తలిదండ్రులకు నచ్చితే తనకూ నచ్చినట్టే నని ఆమె అభిప్రాయం. కాని తండ్రినోట జరిగిన సంగతంతా విన్నాకమాత్రం ఆ అభిప్రాయం మార్చుకుంది.

తన భావిభర్త జాతీయ పతాకం నోట కరుచుకొని మంచు గొడ్డళ్ళూ తాళ్ళూ పట్టుకొని హిమాలయాలు ఎక్కఖ్ఖర్లేదు. ఖడ్గ మృగంతో పోరి దాని కొమ్ము సరిచెయ్య నవసరం లేదు. ప్రిన్సి పాలుగారి మొహంలో సిగరెట్టుపొగ ఊదక్కర్లేదు.

కాని... కాని ప్రేమలేఖ రాసినంత మాత్రాన ప్రాక్టికల్ పరీక్ష ఎగ్గొట్టేటంత పిరికివాడు కాకూడదు. తన ప్రియురాలి తండ్రి వస్తున్నంత మాత్రాన ఇల్లువిడిచి పారిపోయేటంత భీరువు కాకూడదు. జీవితం అంటే ఒక సమరం ఆమె అంచనాలో. ధైర్యవంతుణ్ని లక్ష్మి వరించినా మానినా పిరికి వాణ్ని మాత్రం పరిణయ మాడదు.

తన భావిభర్తకి తన తండ్రితో 'నేను ఫలానా అమ్మాయిని పెళ్ళాడుతాను' అని చెప్పేపాటి ధైర్యమైనా వుండాలి. మగసిరి లేనివాణ్ని తాను చేపట్టలేదు. అటువంటివాణ్ని కట్టుకొని సుఖ పడలేనన్న ఆలోచన రాగానే క్షమించండి నాన్న గారూ! నే నా పిరికిపందను పెళ్ళాళ్ళేను' అనేసింది రాధ ఖచ్చితంగా – వివాహ విషయంలో ఆమె మాటకు ఎప్పుడు ఎదురాడరు ఆమె తలి దండ్రులు.

**(31.12.1965)**

# వెయ్యని ప్రశ్న - ఇవ్వని జవాబు

ఆ రోజు రాధకి బాగా జ్ఞాపకముంది. ఆ సుదినం ఆమె హృద యంలో చెరగని ముద్రవేసి పోయింది. నాడే ఆమెకు తన భావి భర్తతో విచిత్ర పరిస్థితుల్లో పరిచయమవడం, ఆ పరిచయం మొదట ప్రణయంగానూ ఆ తర్వాత పరిణయంగానూ మారడం జరిగింది. ఆ రోజు తన జీవితంలో ముఖ్యమైనదానిగా నాడే గుర్తు పట్టలేకపోయినా, త్వరలోనే దాని ప్రాముఖ్యతని గుర్తించి దాని వివరాలు మధుర స్మృతులుగా తన హృదయంలో దాచు కుని వీలైనపుడల్లా వివరాలు బైటకి తీసి వివరంగా చూసి మళ్ళీ హృదయంలో పెట్టి తాళం వేస్తుందామె అనాడు.....

ఆనాడూ రాధా, జానకి, కమలా, అరుణా ఆఖరుసారి విశాఖ పట్నం సముద్రపొద్దున కూర్చున్నారు. తమ స్నేహితురాలు నిర్మల పెళ్ళికి విజయనగరం వెళ్ళి తిరుగు ప్రయాణంలో విశాఖ పట్టణంలో వాళ్ళు గడిపిన మూడ్రోజుల్లోనూ ఆఖరు రోజది... మర్నాడే హైదరాబాదు వెళ్ళిపోవాలి వాళ్ళంతా, హైదరాబాదు చేరినవెంటనే తాత్కాలికంగా ఆగిపోయిన తమ యాంత్రిక జీవి తాలు మళ్ళీ ఆరంభమవుతాయి.

నిద్ర పూర్తిగా తీరకుండానే లేవడం – రుచిలేని కాఫీ – విసుగుపుట్టించినా తప్పనిసరైనా ముస్తాబు – పది గంటల తొందర భోజనం – చెమటలు కక్కించే బస్సు క్యూలు – అసు పత్రిని గుర్తుకు తెచ్చే గోడల ఆఫీసు బిల్డింగూ – ఆఫీసులో తోడేళ్ళ చూపుల ఆకలీ – కొక్కిరి గీతలు పెడ్తూ పరిగెత్తే పెన్నిళ్ళ విరిగిన ముళ్ళూ–తలని బద్దలు చేసే టైపు మెషిన్లలోహపు చప్పుడూ – ఆనందం యివ్వని వాచీకొట్టే అయిదుగంటలూ – తమకంటే చిన్న వయస్సుగల మగ స్టూడెంట్లు తమని ఆకర్షిం చడానికి బస్సుల్లోనూ, సినిమాల్లోనూ, చేసే వెకిలిచేష్టలూ – అలసిన పరుపులూ–తీరని నిద్రా–తోటి స్త్రీలలా లేమనే వ్యధా – ఇవీ వారి హైదరాబాదు జీవితాలు.

వాళ్ళెవరికీ సిగరెట్లు కాల్చాలనీ, షాంపేను తాగాలనీ సిని మాల్లో వెయ్యాలనీ, స్విట్జర్లాండు వెళ్ళాలనీ కోరికలు లేవు. తమకు వున్నా సాదా దుస్తులు వారికి ఆశాంతి కలిగించవు. జీతాలు పెంచమని వారు కోరలేదు, పన్నులు తగ్గించమని కోరలేదు. సిటీ బస్సులు యెక్కువ చేయమని గాని, రేషనింగు పెట్టమని గానీ, కాంగ్రెస్ గవర్నమెంటుని రాజీనామా యివ్వ మనిగాని వారు కోరలేదు.

వాళ్ళకున్న ఒక్క కోరికా పెళ్ళి చేసుకుందామని, తోటి స్త్రీలలాగే సంసారాలు చేద్దామనీ, పిల్లల్ని కందామనీ.

ఆ నలుగురిలో ఏ ఒక్కరికి పెళ్ళికాలేదు. పెళ్ళి కాలేదన్న బెంగా, వేగం చేసుకుంటే బాగుండునన్న కోరికా నలుగురికీ వున్నాయి. పెళ్ళికావలసిన వయసు త్వరగా దాటి పోతున్నాదని వాళ్ళందరికీ తెలుసు. ఇక బహుశ పెళ్ళి కాదేమోనన్న వ్యక్తం కాని భయం వాళ్ళందర్నీ లొంగదీసుకొంటూంది.

వాళ్ళల్లో ఎవరికీ 23 ఏళ్ళకి తక్కువ వుండవు. కాలుమీద కాలేసుకుని తిండానికి ఆస్తులెవరికీ లేవు. అన్నదమ్ములూ, వది నెలూ అందరికీ వున్నారు. కొందరికి ముసలి తండ్రో, తల్లో వున్నారు. వాళ్ళను జీవితాంతం పోషించే భారం మీదను వేసు కోడానికి గాని వారి పెళ్ళిళ్ళ బాధ్యత తీసుకుందికి కాని ఎవరూ సిద్ధంగా లేరు.

పొట్ట చేత్తో పట్టుకుని టైపు మెషీన్లు జోలిలాకి మెళ్ళో వేసుకొని హైదరాబాదు వాళ్ళలో ఎవరూ రాకపోయినా, అంతా ఉపాధి కోసమే ఆ భాగ్యనగరం చేరేరు. కష్టపడో, సులభంగానో కంపెనీల్లో స్టెనో టైపిస్టు ఉద్యోగాలు సంపాదించుకోగలిగేరు. అంతా ఒకే హాస్టల్లో ఉంటున్నారు.

వాళ్లు రంభ, ఊర్వశి, తిలోత్తమ, మేనకలు కారు. వాళ్ళని చూసిన వాళ్లెవరూ దివి నుండి దిగివచ్చిన నలుగురు అప్సరసల్ని చూసేం అనుకోరు. పెళ్ళిళ్ళు కానందువల్ల ఆరోగ్యంగానూ, కాలంలో వున్నందువల్ల ఉండవలసినదానికంటే ఆకర్షణీ యంగానూ, ఉద్యోగాలు చేస్తున్నందువల్ల ఎరువు మెరుగుల తోనూ వాళ్లుంటారు. నలిగిన నూలుచీరెలు కట్టుకొని మాసిన జాకెట్లు వేసుకుంటే వాళ్ళని ఏ బస్సులోనో సినిమాలోనో చూసిన ఏ మొగోడూ మరోసారి చూడ్డానికి కుతూహలం పడకపోవచ్చు.

వారంతా అత్యంత సౌదర్యం, ప్రత్యేక ఆకర్షణ లేని మామూలు స్త్రీలు. కాని కురూపులు కారు. ఒకరికి నల్లని పొడు గాటి జడ వుంటే, మరొకరికి అందమైన ఉంగరాల నొక్కుల జుత్తు, ఒకరికి శరీర ఛాయ కాస్త తక్కువైతే మరోకరికి కాస్త పల్లపు ముక్కు. వాళ్ళలో ఎవరు ఎక్కువ అందమైన వాళ్ళన్న ప్రశ్నకి జవాబు సులువుగా లభించదు.

"అదృష్టవంతురాలు హాయిగా పెళ్ళిళ్ళు చేసేసుకుంది నిర్మల" అంది సన్నిహితులున్నప్పుడు ధారాళంగా మాటాడే అరుణ.

"ఏం బాగున్నాడే? దాని మొగుడు!" అంది జానకి. నిర్మల భర్త తప్ప ప్రపంచంలో యితర మొగాళ్ళంతా చచ్చినా తాను అతన్ని పెళ్ళాళ్లేనన్నట్లు మొహం పెట్టింది.

"తల మాసినవాడెవడో ఒకడు పెళ్ళిచేసుకుంటే బాగుణ్ననే వయిసొచ్చేస్తున్నాది మనందరికీ" అంది కమల పులి కోరలాంటి సత్యాన్ని బైటపెడ్తూ.

"అలా అయితే అదుగో! అణ్ణెవరో ఒకరు పట్టండి"

అని అరుణ వాళ్ళతో అని "అన్నయ్యా!" అని కాస్త దూరంలో తలవంచుకుని నడుస్తున్న తన అన్న శేఖరాన్ని పిలిచింది.

శేఖరం వాళ్ళ వద్దకు వచ్చేడు. పరిచయాలు అరుణే పూర్తి చేసింది. శేఖరం విజయవాడలోని ఒక పెద్ద కంపెనీలో ఎకౌం టెంటు. అతని జీతం గుమాస్తా జీతానికి ఇరవై రూపాయలు ఎక్కువ. ఆఫీసరు జీతానికి రెండు వందలు తక్కువ. అను కోకుండా విశాఖపట్నం కేంపుమీదొచ్చేడతను.

పరిచయాలైన వెంటనే "అన్నట్టు చెప్పడం మరిచేనురి మీ వూరే నాకు ట్రాన్స్‌ఫరైంది" అన్నాడు శేఖరం అందర్నీ ఒక నవ్వుతో చుట్టేస్తూ చూసి.

ఆ వార్తకి అంతా సంతోషించేరు. సంభాషణ అందరి మధ్య సాగుతూనే వుంది.

ఈలోగా స్నానం చేసిన సద్బ్రాహ్మళ్ళా నిండు చంద్రుడు – సముద్రంలోంచి లేచేడు.

సముద్రాన్ని అలలు చిన్న పిల్లల్లా అల్లకల్లోలం చేసేస్తున్నాయి.

ఒక కొబ్బరిచెట్టు ఆకులు వెన్నెలకి తడిచి మెరిసేయి.

రాధ కళ్లు ఆనందంతో మిలమిల్లాడేయి. వారంతా మాట్లాడు తున్న కొద్దీ శేఖరం తనపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నాడని ఆమె గ్రహించింది. అతని మొహం మీద వెన్నెల పడకపోయినా అతను యెటు చూస్తున్నాడో కనిపించకపోయినా అతని చూపుల వెచ్చదనం తనని అలుముకుంటున్నట్లు ఫీలైందామె.

సినిమాల నుంచి సింహాచలం యాత్ర వరకూ అనేక విష యాలు మాటాడి ఆరు లేచేసరికి తొమ్మిద్దాటింది. మిగతా వాళ్ళని వాళ్ళ హోటల్ వద్ద విడిచి శేఖరం శలవు తీసుకుంటుంటే వీళ్ళ ముగ్గుర్లో ఎవరో ఒకర్ని పెళ్ళాడేయ్ అన్నయ్యా! అంది అరుణ స్నేహితురాళ్ళని హేళన చేస్తూ.

బరువైన సిగ్గు అందరి తలలూ వంచింది. కాని రాధ మాత్రం శేఖరం దించిన కళ్ళతోనే తనవేపు చూడడం తన కంటి కొసల్నుండి చూడగల్గింది. శేఖరం మరి తలెత్తకుండా వెళ్ళిపోయాడు. ఓ – అలాగే తప్పకుండా! అంటూ.

❖ ❖ ❖

ఓ అలాగే తప్పకుండా అన్నారు. జానకీ, కమలా వాళ్ళని రాధా శేఖరం వివాహానికి ఆహ్వానించినప్పుడు.

బేండు రండోళ్ళూ, సన్నాయి నొక్కులూ, లౌడ్‌స్పీకర్ల కీచు పాటలూ, స్నేహితురాళ్ళ కిలకిలలూ, మత్తుగా లేచే ఊదొత్తుల నీలిపొగలూ, అర్థంకాకపోయినా శ్రావ్యంగా వినిపించే మంత్రాలూ, అలలుగా లేచే సెంటు వాసన్లూ తలంటిపోసుకున్న ఆడాళ్ళ జడలూ, కష్ట సుఖాల నుభవించిన పురోహితుల నెరిసిన తలలూ, నిండయిన ముత్తయి దువుల కుంకుమబొట్లు ఎరుపూ పెళ్ళిలో రాధ చుట్టూ అలుముకుంటున్న మత్తు తెరలుచించి ప్రస్తుతాన్ని ఆమె ముందుంచాయి.

అదృష్టవంతురాలు హాయిగా పెళ్ళి చేసుకుంది. అంది జానకి కమలతో హాస్టల్ చేరాక.

మొగుడు కూడా చూడ్డానికి ఫర్వాలేదు. అని తన అభిప్రాయం వెలిబుచ్చింది కమల.

పెళ్ళయిన కొన్నాళ్ళ వరకూ దివికి భువికీని ఇంటికీ ఆఫీసుకి ఉన్నంత దూరమే–వుందనిపించింది రాధకి. ఆమె ఇంద్రధనస్సు మీద నాట్యం చేసింది. మేఘాల అంచున ప్రయాణం చేసింది.

కొన్నాళ్ళవరకూ –

గులాబీ రేకుల మధ్య సిగ్గు దొంతర్లు కనిపించేయామెకి. మల్లెపందిరి వలపుపూలు పూసిందామె దృష్టిలో. చంద్రుడికి చందనం వాసన వున్నట్టనిపించింది. తన బస్సు వెళ్ళే తారురోడ్డు టెక్నికలర్లో అడుగుపడేదామెకి ... ఆఖరికి టైపుమెషిన్లు చప్పుళ్ళతో వింత సంగీతం వినిపించేదామెకు.

ఆమె చెక్కిళ్ళు గులాబులు పూసేవి శేఖరాన్ని చూసినప్పుడల్లా.

కాని యిదంతా కొన్నాళ్ళే!

కాలం దొర్లుతున్నకొద్దీ రాధ స్వర్గం నుండి ఈ ప్రపంచం వేపు గబగబా రాసాగింది.

పెళ్ళయిన నెల తిరగ్గానే పాలవాడు పాలల్లో కలిపే నీళ్ళు గుర్తించగలిగింది.

రెణ్ణెలు కాకుండానే కందిపప్పు శేరు రెండున్నర దాటిందని తెలుసుకొంది.

మూణ్ణెల్లలో తనకి ఇచ్చిన ఐదు రూపాయల ఇంక్రిమెంటూ వచ్చినా ఒకటే మానినా ఒకటేని గ్రహించింది.

నాల్నెల్లలో ఒక మనిషికి నెలకి యెంత ఖర్చౌతుందో యిద్దరు మనుషులకు అంతకు రెండింతలు పైగానే ఖర్చౌతుందనీ తెలుసుకుంది.

ఐదు నెల్లయేసరికి మెటర్నటీ లీవు వివరాలు నేర్చుకుంది అవసరమొచ్చి.

ఇన్ని తెలుసుకున్న రాధ తెలుసుకోలేంది ఒకటే! శేఖరం తనలో దేన్ని చూసి తన్ని భార్యగా స్వీకరించాడు? తనకంటే జానకి తెలుపు. తనకి నల్లని పెద్ద జడుంటే కమలది ఉంగరాల నొక్కుల జుట్టు. తన యిద్దరి స్నేహితురాళ్ళ కన్నా తాను యెందులో మిన్న? కాని వొక విషయం మాత్రం నిశ్చయం. సముద్రపొద్దున తమందరినీ చూసిన దగ్గర్నించీ శేఖరం తనని ప్రత్యేకంగా చూడసాగాడు. కాని ఎందువల్ల? ఎంత తర్కించినా ఈ ప్రశ్నకు జవాబు ఆమెకు దొరకలేదు.

ఈ ప్రశ్నకి సమాధానం తెలుసుకుందామన్నా కుతూహలం పెళ్ళికి ముందే బీజంగా వుంది, పెళ్ళి తర్వాత మొలకెత్తి సంవత్సరం తిరగేలోగా ఊడలు తన్నిన జడలమర్రిలా విస్తరించి పోయింది. క్రమేపీ ఆ తలపే ఆమె మనసునంతా ఆక్రమించుకొంది. భర్తనే సమాధానం అడుగుదామనుకుండేది. కాని యెప్పుదు అడుగదామను కున్నా సిగ్గు ఆమె పెదవులను విడనివ్వలేదు.

❖ ❖ ❖

పెళ్ళయి సమంగా ఆ రోజుకి సంవత్సరం. ఆ రోజు ఆమె భర్తను ఆ విషయం అడిగెయ్యదల్చుకుంది.

నేనొకటడుగుతాను చెప్తారూ! లాలనగా ప్రశ్నించింది.

ఊ విసుగ్గా మూలిగేడు శేఖరం ఇప్పుడీ హస్కేమిటన్నట్టు తన్ను దగ్గరికి తీసుకుంటూ...

"అబ్బా చెప్తేనే"

"ఏమిటో అడుగు"

"అబద్ధం ఆడరుకదూ!" నిజంకాని సందేహం వెలిబుచ్చింది మాటలకు తడుముకుంటూ

"ఆడను"

"ఒట్టు?"

"ఒట్టు!"

మీరు నన్ను చూసినప్పుడే నన్ను..... అందర్లాగే చూళ్ళేదు కదూ?

"....."

"నాలో ఏం చూసి పెళ్ళాడేరు నన్ను"

"....."

"చెబ్దురూ?"

"అందర్నీ చూసినట్టే నిన్ను చూళ్ళేదు"

"ఏం?"

"ఇప్పుడు నన్నా విషయం అడక్కు రాధా!"

"ఒట్టేసేరు నాకేం" అంది మంచం మీద జారిపోతూ.

వెంటనే చెప్తానని ఒట్టేయ్యలేదు కదా! చెప్తా తప్పకుండా చెప్తా, కానిప్పుడు కాదు. నాలుగేళ్ళుపోయాక సమంగా యిదే రోజుని మళ్ళీ అడుగు అప్పుడుచెప్తా, తప్పకుండా చెప్తా అన్నాడు ఆమె దగ్గరకు వెళ్తూ.

రాధ అతన్ని చెంత చేరనివ్వలేదు. సమాధానం వెంటనే కావాలని చిన్నపిల్లలా మారం పెట్టింది. పాములా బుసకొట్టింది. ఏడాది కాపురం చేసిన పెళ్లాంలా దబాయించింది. శేఖరం బతిమాలేడు. లాలించేడు. బుజ్జగించేడు. ఎలా ఐతేనేం బుజ్జ గింపబడ్డానికి వప్పుకుంది రాధ.

❖ ❖ ❖

రోజులూ నెలలూ పెనవేసుకొని పొడుగ్గా సంవత్సరాలౌ తున్నాయి.

బియ్యంలో రాళ్లు-యిళ్ళద్దెలూ జాస్తి ఔతున్నాయి. పాలవాడి దృష్టిలో పాలకీ నీళ్ళకి తేడా పూర్తిగా పోయింది, బస్సుల్లో నిల బడ్డ ఆడవాళ్ళకి మగాళ్లు సీట్లు యివ్వడం తగ్గించేస్తున్నారు. రాధ కూతురు, తర్వాత పుట్టిన కొడుకుని వీలైనప్పుడల్లా కొడుతోంది.

నెలకి నాలుగుసార్లు సినిమాలు చూసే రాధ నెలకో సినిమాకి తగ్గించేసి అంతటితో సంతృప్తిపడక పిక్చర్తో పెట్టుకోక తనింటికి దగ్గరలో వున్న హాలులుకే వెళ్ళడం ప్రారంభించింది. రిక్షాఛార్జీలు మిగుల్చుకుందుకి.

జీవితం ఆమె దృష్టిలో ఇంద్రధనస్సు రంగులు కోల్పోయింది. టైపు మిషీనుల చప్పుడులో రాగం పోయింది. చప్పుడు సమ్మెట దెబ్బల్లా వుంది. తారురోడ్లు మళ్ళీ ఎప్పట్లా నల్లగా అసహ్యంగా కన్పిస్తున్నాయి.

చిరిగే చీరలు-పాలడబ్బాలు బ్లేక్ మార్కెట్ - బిడ్డల ఏడుపు వంటాలస్యమైందనో - చాకలి బట్టలు తేలేదనో, భర్త చీదరిం పులు, ఆఫీసుకు పోవడానికి బస్సు దొరకదన్న బెంగ - ఇరు గింటివారికి పంచదాక ఐపోయి అప్పివ్వరే మోనన్న అనుమానం - తానే డబ్బు అప్పుచేయవలసి వచ్చే 20వ తారీఖులోగానే పొరుగింటావిడ తన వద్దకి అప్పుకి వస్తుందేమోనన్న భయం. ఏ చుట్టమో పక్కమో వచ్చి తనింట్లో తిష్టవేసి హైదరాబాదంతా తాపీగా చూస్తాదేమోనన్న భీతి. ఆమెని నిత్యం ఆరాటపెడుతూనే వున్నాయి.

తనదీ తన భర్తదీ చాలని జీతాలు. పెరుగుతున్న కొద్దీ సంసారం పెచ్చౌతున్నకొద్దీ అమెని నిత్యం ఆరాటపెట్టేవి. జీవితంలోని ఆనందాన్ని నే అజ్ఞాతశక్తో దోపిడీ చేసింది.

తన అశాంతికి కారణాలు ఆమెకు తెలియవు. దినుసుల కరువు, పంచదార బ్లాక్ మార్కెట్టూ, తమ జీతాన్ని ఓడించి పెరిగిన ధరలూ, పొడుగాటి బస్సుక్యూలుకావచ్చు. లేకపోతే వైవాహిక జీవితం పాతబడి దానిలోని మోజు మాయమైదాని బాధ్యతలే అసహజమైన పెద్ద సైజులో కనిపించి ఆమెలో నిరాశా, నిస్పృహ, విసుగూ కలిగించి ఉండవచ్చు.

కానీ, తనకీ, భర్తకీ మధ్య అనురాగం తగ్గలేదని తెలుసు. ఆ అనురాగం వ్యక్తం చెయ్యవలసిన సందర్భాలు మరీ అరుదై పోతున్నాయి. అంటే నిత్యం జీవితంలో ఆమెకు ఏదో వెలితి కనిపిస్తూనే ఉంది. అయిదేళ్ళ పాతదనం - చిరిగిన చిరునవ్వులు - పగిలిన ఆశలు - అర్థంకాని వెలితి జీవితంలో ఓటమి - బతుకులో విసుగూ, ఆమె వైవాహిక జీవితంలోని ఆనందాన్ని హరించేసేయి.

మల్లెపందిర మల్లెపూలే పూస్తోంది.

గులాబీ రేకుల మధ్య శూన్యం తప్ప మరింకేమీలేదు.

చంద్రుడికి చందనం వాసన పోయింది.

టైపు మెషీన్ల చప్పుడు సమ్మెట దెబ్బలా వుంది.

ఆ రాత్రి ఆమె కిటికీ తెరిచింది. నిండు చంద్రుడు ఆమెని

పలుకరించేడు. నెలకోసారి యింటద్దె వసూలు చేసేవాళ్ళూ వచ్చే చంద్రుడిలో ఆమెయే కొత్తదమూ చూళ్ళేకపోయింది.

చంద్రుడు చందనం వాసన ఆమె మీద వెదజల్లలేదు. కింద కుళ్ళు కాలవనుంచి కంపు మెల్లగా మెలికలు తిరుగుతూ అడిగేడు శేఖరం.

రాధా, నన్ను కట్టుకొని సుఖపడ్డావా ! మెల్లగా అడిగేడు శేఖరం.

ఇంటి ఆసామి పెంచిన అద్దెకీ, మంత్రులు పెంచిన పన్నులకీ తన భర్త బాధ్యుడుకాడని తెలుసుకొనే వివేకం ఆమెకుంది.

ఇప్పుడవన్నీ ఎందుకండీ! అంది విసుగ్గా. కాని సుఖపడ్డాను అన్న జవాబు తనకి తెలియని కారణాల వల్ల యివ్వలేక పోయింది.

నన్ను మొదట చూసినప్పుడు నాలో ఏవిటి నిన్నాకర్షించింది? మళ్ళీ అడిగేడు శేఖరం.

మరీ బావుంది వరస, లేని నవ్వు తెచ్చిపెట్టుకుని జవాబిచ్చింది.

నాలో యేం చూసి పెళ్ళాడేవు? దేన్నో గుర్తుకుతెస్తున్నట్టు శేఖరం ప్రశ్నించేడు.

ఆమె జవాబులు చెప్పుకుంటూ దూరంగా శూన్యంలోకి చూస్తే కిటికీ దగ్గరే నిలబడిపోయింది.

నాలో ఏం చూసి నన్ను పెళ్ళాడేరు? మీరు మొదట మమ్మల్నందర్నీ చూసినప్పుడే నన్ను అందర్నీ చూసినట్టే చూళ్ళేదు కదా? అని రాధ అడుగుతుందని శేఖరం ఆశించేడు. కాని ఆమె ఆ ప్రశ్నలు వెయ్యలేదు.

నాటికి వారి వివాహమై సరిగ్గా ఐదేళ్ళు.

**(31.12.1965)**

# రిలీవరు

"**పూ**ర్వ రోజులైతేనా?... పెద్ద పెద్ద మర్చెంట్స్ ఖాళీ చేసేవారు తన కోసం ఫ్రంటు సీటు. ఈ వేళెలా వుందో నా అదృష్టం అనుకున్నాడు తాసీల్దారు రాజేశ్వరావు"

తాసీల్దారు రాజేశ్వర్రావుకి తెగ కోపం వచ్చింది.

రాని బస్సుమీద.

వచ్చి నెత్తికెక్కి కూర్చున్న సూర్యుడి మీద.

ఎప్పుడొస్తాడో తెలీని తన రిలీవరు మీద.

తన ఉద్యోగం గజెట్చేసిన గవర్నమెంటు మీద.

అసలు ఈ మధ్య జరిగినదేదీ అతనికి నచ్చలేదు. ఇంత వరకూ స్వంత ఊళ్ళో, పుట్టిన జిల్లాలో కాలుమీద కాలేసుకొని దర్జాగా రాజాలా ఉద్యోగం చేసుకునేవాడు.

తనుద్యోగం గజెట్ చేసేక, తొలిసారి తన జిల్లా, మరో మూడు జిల్లాలూ తప్పించి బదిలీ చేశారు. 'పిల్లకి పెళ్ళి చేసుకోవాలి బాబోయ్ ట్రాన్సఫరాపం' దన్నాడు. 'కొత్త ఊళ్ళోనే చెయ్ పెళ్ళి' అన్నారు పై అధికార్లు. 'వీళ్ళకిదే శాస్తి' అని నాల్నెల్లు సెలవు పెట్టేశాడు. ఆ వూరు తప్పించు కుందికి.

సెలవ్ ఖర్చు తప్పిస్తే పిల్ల పెళ్ళీ కాలేదు, బదిలీ తప్పలేదు. సెలవాఖర్ని అక్కడికే, మళ్ళీ ఆ వూరే వెళ్ళమని మొండిపట్టు పట్టింది గవర్నమెంటు.

తన ఊరేం గొప్పదని కాదు, ఆ వూళ్ళో మిత్రుల్లా వుండే శత్రువులు, శత్రువుల్లా వుండే మిత్రులూ తప్పిస్తే మూడోరకం మనుషులు కన్పించరు. అన్నిట్లోనూ పాలిటిక్స్. ప్రతిదాన్లో లిటిగేషన్.

కాని ఎంతచెడ్డా తన స్వంతవూరది. అందుకే దాని మీదంతభిమానం తనకి. అందులోనూ తాసిల్దారు పనంటే తమాషా కాదు. కరణాల పేచీలతో మనసబుల మడతలతో నిండి పోయుంటుంది.

మనసబు మీసం చూసి చెప్పేయ్యాలి వాడు మనెప్రోప్రియేటరో కాడో.

కరణం కళ్ళు చూసి కనిపెట్టెయ్యాలి కల్టివేషనేకౌంటు కుకప్ చేస్తాడో లేదో.

ఆ వచ్చే కుర్రముండావాడు చస్తాడు ఈ ఊరి మతలబీలర్ధం కాక, గూడుపుఠాణీల్లో ఉక్కిరిబిక్కిరైపోతాడు. అందులోనూ డైరెక్టురిక్రూట్ట, నా మొహం కాదూ! గుమాస్తాగా పుట్టి, రివిన్యూ యినస్పెక్టరుగా పెరిగి, తాసిల్దారైన తనకే ఈ ఉద్యోగం లోతుల్లో అడుగు తగల్డం లేదే, ఇంక వాడేం చేసిచస్తాడు. ఎమ్మే పాసై పరీక్ష ల్లగలెట్టినట్టుగాదు తాసీల్దారీ!

ఏదో వాడి ఖర్మాన వాడు పోతాడు. నా ఖర్మాన్నేపోదును. బస్సొస్తే అనుకున్నాడు రాజేశ్వర్రావు.